సాక్షి
పల్నాడు
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ఈవీఎం గోడౌన్ల పరిశీలన

గుంటూరు వెస్ట్ : ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం లో ఉన్న ఈవీఎం గోడౌన్లను అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంఎన్ హరేంద్ర ప్రసాద్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు.



బైజూస్ ద్వారా బోధించాలి

నకరికల్లు: బైజూస్ ద్వారా బోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పాఠశాల విద్య జేడీ జి.లింగేశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 516.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

కోటప్పకొండ తిరునాళ్లకు సన్నద్ధం



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మార్చి8వ తేదీన నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లకు పోలీసు అధికారులు సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. కొండ దిగువన నరసరావుపేట, చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలు, ప్రభలు నిలిపే స్థలం , కొండకు వచ్చే మార్గాలను పరిశీలించారు. స్వామివారి దర్శనానికి వచ్చే యాత్రికుల క్యూలైన్‌లు, రక్షణ చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రవి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం తిరునాళ్ల సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, సమస్యలను అధిగమించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ, పీఆర్, పోలీసుశాఖ సమన్వయంతో కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిపారు. అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఎస్‌బీ సీఐలు ప్రభాకర్, బాలనాగిరెడ్డి, రూరల్ సీఐ మల్లికార్జున రావు, ఎస్ఐ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

హీరా ఇస్లామిక్ స్కూల్‌కు ఎమ్మెల్యే ఆర్కే విరాళం



మంగళగిరి: నగరంలోని హీరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న హీరా ఇస్లామిక్ స్కూల్‌లో తాగునీటి వసతి, మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాస్ రూమ్ నిమిత్తం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.2లక్షల విరాళాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ పట్టణ నాయకుల చేతుల మీదుగా ఇప్పించారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు ఆలీబాషాఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఇక్బాల్, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, రాచకొండ వెంకటేశ్వరరావు, దొడ్డక కృష్ణ, కుంచాల కిషోర్, మల్లవరపు సుధారాణి, సంకె సునీత పాల్గొన్నారు.

స్కూల్‌బస్సును ఢీకొన్న లారీ

నరసరావుపేట రూరల్: స్కూల్ బస్సుకు జరిగిన ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలైన ఘటన కోటప్పకొండ రోడ్డు జంక్షన్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతో ప్రయాణిస్తూ ఆర్‌టీఓ కార్యాలయంలో సమీపంలోని కోటప్పకొండ రోడ్డు జంక్షన్ దాటుతుండగా వినుకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. స్కూల్ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ జంక్షన్ దాటే ప్రయత్నం చేయడమే ప్రమాదానికి కారణమని తెలుస్తుంది. స్కూల్ బస్సును గుర్తించిన లారీ డ్రైవర్ వేగాన్ని నియంత్రించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సులోని కొందరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

యార్డుకు 1,59,820 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,59,820 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,42,382 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,03,060 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

జనసున్నానేనా..!?

- పొత్తులో కేవలం 24 సీట్లే కేటాయించడంతో తీవ్ర నిరాశలో జనసేన అభిమానులు
- తక్కువ సీట్లు ఉండటంతో జిల్లాలో పోటీకి అవకాశం రాదేమోనన్న నిరుత్సాహం
- పల్నాడులో ఏడింట నాలుగుస్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ
- మిగిలిన మూడు చోట్ల అవకాశం లేనట్టే
- నరసరావుపేట అసెంబ్లీకి జిలానికి అవకాశం ఇవ్వాలని కోటప్పకొండకు పాదయాత్ర చేసిన జనసేన కార్యకర్తలు
- తక్కువ సీట్లకు ఒప్పుకోవడంపై పవన్ పై రగిలిపోతున్న జనసేన అభిమానులు
- పొత్తు పొడవదంటూ పెదవి విరుపు



జిలానీకి నరసరావుపేట టికెట్ ఇవ్వాలని పాదయాత్రకు సిద్ధమైన జనసేన కార్యకర్తలు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: తెలుగుదేశం - జనసేనల పొత్తు ఒప్పందం చూసిన జనసేన అభిమానులు ఇంకా షాక్ నుంచి కోలుకోలేదు. రాజకీయ జిత్తులమారి చంద్రబాబు దెబ్బకు ఆ పార్టీ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 స్థానాలకు గాను కేవలం 24 సీట్లు ఇవ్వడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. కనీసం 15 శాతం సీట్లు కూడా పొందని పొత్తు ఎందుకంటూ ఆ పార్టీ అధినేత పవన్‌ను ప్రశ్నిస్తున్నారు. జనసేనను నమ్ముకొని పనిచేస్తున్న తమ భవిష్యత్తు ప్రమాదంలో పడిందంటున్నారు. ఇంత తక్కువ చోట్ల పార్టీ పోటీ చేస్తుండటంతో జనసేన ప్రభావం చెప్పుకోదగ్గ స్థాయిలో లేని పల్నాడులో పోటీ చేసే అవకాశం ఉండదన్న భావన వారిలో నెలకొంది. పల్నాడులో జనసున్నాలుగా మిగలాల్సిందేనా! అన్న అనుమానం వారిలో నెలకొంది.

సత్తెనపల్లిలో మొండిచెయ్యి..

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇప్పటికే టీడీపీ నాలుగు చోట్ల తమ అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో సత్తెనపల్లి నుంచి పోటీ చేయాలని జనసేన నాయకులు ముందు నుంచి భావిస్తున్నారు. బొర్రా వెంకట అప్పారావు, బోనబోయిన శ్రీనివాసయాదవ్, గాదే వెంకటేశ్వరరావులు పోటీకి ఉత్సాహం చూపారు. పార్టీకి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బొర్రా అప్పారావు అయితే మరో అడుగు ముందుకేసి ప్రచార వాహనాలు, కార్యాలయాలు ఏర్పాటుచేసుకొని తాను పోటీ చేస్తానని ప్రకటించుకున్నారు. తీరా చూస్తే శనివారం సత్తెనపల్లి నుంచి కన్నా లక్ష్మీనారాయణ పోటీ చేస్తారంటూ చంద్రబాబు ప్రకటించారు. దీంతో జనసేన నాయకుల్లో తమ భవిష్యత్తు ప్రమాదంలో పడింది, పొత్తు ధర్మం పాటించి కన్నాకు సహకరించాలా వద్దా అన్నదానిపై తమ అనుచరులతో చర్చిస్తున్నారు.

జిలానీకి నిరాశ తప్పదా...?

అభ్యర్థులను ప్రకటించని మూడు స్థానాల్లో గురజాల, పెదకూరపాడులలో జనసేనకు కేటాయించే అకాశాలు దాదాపుగా లేవన్న వాదన వినిపిస్తోంది. మరో స్థానం నరసరావుపేటపై జనసేన నేతలు ఆశలు పెట్టుకున్నారు. జనసేన తరఫున గత ఎన్నికల్లో నరసరావుపేట నుంచి పోటీ చేసిన మాజీ యార్డు చైర్మన్ సయ్యద్ జిలానీ 8 వేలకు పైగా ఓట్లు సాధించారు. అప్పటినుంచి పార్టీ కోసం పనిచేస్తున్నారు. ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ ఇప్పటికే నరసరావుపేటలో పార్టీలకు అతీతంగా ముఖ్య నాయకులను కలసి సహకరించమని కోరారు. పవన్, నాదెండ్ల నుంచి స్పష్టమైన హామీ ఉందంటూ తన అనుచరులు, సన్నిహితులతో చెప్పుకుంటున్నారు. అయితే టీడీపీ నుంచి పొత్తులో కేవలం 24 సీట్లు తీసుకోవడంతో జిలానీ ఆశలు గల్లంతేనన్న వాదన జనసేన క్యాడర్‌లో నెలకొంది. సీటు రాదన్న భయంతో ఆయన అనుచరులు ఆందోళనలో ఉన్నారు. జిలానీకి నరసరావుపేట సీటు కేటాయించాలని కోరుతూ కోటప్పకొండ వరకు ఆదివారం పాదయాత్ర చేశారు. అయితే ఈ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థే పోటీ చేస్తాడని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

రగిలిపోతున్న క్యాడర్..

పల్నాడులో జనసేనకు పోటీ చేసేంత బలం లేదని, వారికి సీటు కేటాయిస్తే అప్పనంగా వైఎస్సార్ సీపీకి ఓ ఎమ్మెల్యేని ఇచ్చినట్టు అవుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే తక్కువ సీట్లతో మోసం చేశారని టీడీపీపై కోపంగా ఉన్న జనసేన క్యాడర్‌కు ఇటువంటి అవమానకర మాటలతో మరింత రగిలిపోతున్నారు. కేవలం టీడీపీకి లబ్ధికలిగేలా జరిగిన పొత్తు పొడవదంటూ జనసేన అభిమానులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా పల్నాడులో కనీసం ఓ అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే టీడీపీకి తగిన గుణపాఠం చెబుతామంటున్నారు.

పేదల చెంతకు కార్పొరేట్ వైద్యం

- అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్
- బ్రాహ్మణపల్లి డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కళాశాల ఫేజ్-1లో భాగంగా 100 పడకల ఆస్పత్రి ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నం

పిడుగురాళ్లరూరల్: పల్నాడు ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు రాష్ట ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని వైఎస్సార్ సీపీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో బ్రాహ్మణపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ మెడికల్ వైద్యశాలలో ఫేజ్ 1లో భాగంగా 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నర్సరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంలు హాజరయ్యారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, శాసన సభ్యులుగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడిగా తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మూడు నెలల్లో పూర్తిస్థాయిలో సిద్ధం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వంశీ వండర్

6 బంతుల్లో 36 పరుగులు.. 48 బంతుల్లో శతకం

- ఆంధ్ర క్రికెట్‌లో యువ సంచలనం
- ఒకే ఓవర్‌లో 6 సిక్స్‌లు కొట్టిన క్రికెటర్‌గా రికార్డు
- డొమెస్టిక్ క్రికెట్‌లో తక్కువ బంతుల్లో వేగవంతమైన సెంచరీ
- గుంటూరుకు చెందిన క్రికెటర్ మామిడి వంశీకృష్ణ
- భారత జట్టులో స్థానమే లక్ష్యమంటున్న కీపర్ కమ్ బ్యాట్స్‌మెన్



భారత జట్టు వికెట్ కీపర్ కేఎస్ భరత్‌తో వంశీకృష్ణ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఫిబ్రవరి 18వ తేదీ.. వైఎస్సార్ కడప జిల్లాలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియం. రైల్వేస్ - ఆంధ్ర జట్ల మధ్య 4 రోజుల క్రికెట్ మ్యాచ్. సహజంగా టెస్ట్ మ్యాచ్‌లలో పరుగులు కొంత నెమ్మదిగానే నమోదవుతాయి. అయితే ఆ రోజు ఒక రికార్డు నమోదవుతుందని ఎవ్వరూ ఊహించలేదు. గుంటూరుకు చెందిన రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్ మామిడి వంశీకృష్ణ బ్యాటింగ్‌కు దిగిన కొంతసేపటికి రైల్వేస్ స్పిన్నర్ దమన్‌దీప్ సింగ్ బౌలింగ్‌కు దిగాడు. అంతే తొలి బంతిని సిక్సర్‌గా మలచిన వంశీ కృష్ణ వరుసగా ఆ ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టి గ్యాలరీలను మోతమోగించాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టిన మొదటి బ్యాట్స్‌మెనే కాకుండా ఇండియాలో 4వ వాడిగా (రవిశాస్త్రి, గైక్వాడ్, యువరాజ్ సింగ్‌ల తర్వాత) నమోదయ్యాడు. అదొక్కటే కాదు ఆ మ్యాచ్‌లో 10 సిక్సర్లు, 8 బౌండరీలతో కేవలం 48 బంతుల్లోనే సెంచరీ చేసి డొమెస్టిక్ క్రికెట్‌లోనే వేగవంతమైన శతకం నమోదు చేశాడు. (ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది)

విభిన్న ఆటతీరుతో దూకుడు..

గుంటూరుకు చెందిన 22 ఏళ్ల వంశీకృష్ణ సుమారు పదేళ్ల క్రితం అంటే 11 ఏళ్ల వయస్సులో సరదాగా సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపులో అరంగేట్రం చేశాడు. బాబాయ్ మోహన్‌రావు అప్పటికే రాష్ట క్రికెటర్ కావడంతో వంశీకృష్ణను ప్రోత్సహించాడు. తొలుత సరదాగా ప్రారంభించిన క్రికెట్ ఆ తర్వాత కోచ్ రఘు చొరవతో త్వరగానే ఒంటబట్టించుకున్నాడు. ఇక రాష్ట్రస్థాయి మ్యాచ్‌లు ఆడేసరికి తన ఆటలో దూకుడు పెంచాడు. బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌తో ఆంధ్ర జట్టులో అన్ని ఫార్మెట్లలోనూ కీలకంగా ఎదిగాడు. ఆ తర్వాత మస్తాన్ రెడ్డి, ఆర్‌వీ ప్రసాద్, కృష్ణారావుల సారథ్యంలో అన్ని విభాగాల్లోనూ ప్రతిభ చాటుతున్న సమయంలోనే 2021లో ఆంధ్ర రంజీ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

మలుపుతిప్పిన సీకే నాయుడు ట్రోఫీ...

ఈ ఏడాది జరిగిన అండర్-23 సీకే నాయుడు ట్రోఫీ సీజన్‌లో కేవలం 6 మ్యాచ్‌లలోనే మూడు సెంచరీలు, రెండు అర్ధ శతకాలతో 550 పరుగులు చేశాడు. దానికి ముందు అండర్-23 స్టేట్ జట్టుకు కెప్టెన్‌గా తనదైన ముద్ర వేశాడు. సయ్యద్ ముస్తాఖ్ ఆలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలో ఆడాడు. ప్రస్తుతం ఆంధ్ర యువ జట్టులో నమ్మదగిన బ్యాట్స్‌మెన్‌గా, వికెట్ కీపర్‌గా మారాడు. గత మూడు సీజన్‌ల నుంచి రంజీ జట్టులో చోటు ఉన్నప్పటికీ మ్యాచ్‌లు ఆడే అవకాశం రాలేదు. వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోవడానికి ఇష్టపడని వంశీకృష్ణ తప్పకుండా భారత్ జట్టులో స్థానం దక్కించుకుంటాడని అతని కోచ్‌లు అంటున్నారు.

భారత జట్టులో చోటే లక్ష్యం..

గత ఐదేళ్ల నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పెద్దలు శరత్‌చంద్రా రెడ్డి, గోపీనాథ్ రెడ్డిల ప్రోత్సాహంతో రాష్ట్రంలో క్రికెట్‌కు వసతులు పెరిగాయి. మెరుగైన శిక్షణ లభిస్తుంది. దీంతో యువతలో తీవ్రమైన పోటీ ఏర్పడింది. అవకాశం వస్తే సద్వినియోగం చేసుకుని నిరూపించుకోవాలి. నాకు ఇప్పటివరకు వచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకున్నా. కడపలో ఒకే ఓవర్‌లో కొట్టిన ఆరు సిక్స్‌లు, ఫాస్టెస్ట్ సెంచరీ ఎప్పటికీ మరచిపోలేను. భారత జట్టులో చోటే ప్రధాన లక్ష్యంగా సాధన చేస్తున్నాను. కుటుంబ సభ్యులు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారం మరువలేనిది.

– మామిడి వంశీ కృష్ణ, ఆంధ్ర రంజీ క్రికెటర్

సంచార పశు వైద్య సేవ వాహనాల్లో డ్రైవర్ పోస్టులు

గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లాలో సంచార పశు వైద్య సేవ వాహనాల్లో డ్రైవర్ పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పాతపాటి బాల చంద్రుడు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి, మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకానిలో డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు డ్రైవింగ్‌లో 2 లేదా 3 సంవత్సరాల అనుభవంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మేనేజర్ బాల చంద్రుడు మొబైల్ నంబర్ 9032876888లో సంప్రదించాలన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6000, గరిష్ట ధర రూ.7400, మోడల్ ధర రూ.6600 వరకు పలికింది.

సిద్ధం సభలు చారిత్రాత్మకం



విలేకరులతో మాట్లాడుతున్న అనిల్ కుమార్ యాదవ్, వేదికపై ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు

- జన సునామీగా మారనున్న నాలుగో సిద్ధం సభ
- ప్రాంతీయ పార్టీల సభలకు 10 లక్షలకు మించి హాజరవడం ఇదే ప్రథమం
- సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల ఆశీస్సులే ఇందుకు నిదర్శనం
- నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: మార్చి 3వ తేదీన బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరగనున్న నాలుగో సిద్ధం సభ చరిత్రలో నిలిచిపోనుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నర్సరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మాచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశచరిత్రలో ఇప్పటివరకు ఏ ప్రాంతీయ పార్టీ 10 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించిన చరిత్ర లేదన్నారు. అటువంటిది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన భీమిలి, దెందులూరు, రాప్తాడు సభలకు 10 లక్షలకు మించి జనం హాజరయ్యారన్నారు. మార్చి 3వ తేదీన బాపట్ల జిల్లా అద్దంకి నియోజక వర్గంలోని మేదరమెట్లలో జరగనున్న నాలుగో సిద్ధం సభకు అంతకు మించి జనం హాజరుకానున్నారన్నారు. మేదరమెట్ల సిద్ధం సభ చారిత్రాత్మకం కానుందన్నారు. అధికారంలోకి వచ్చిన 58 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాల రూపంలో కుల, మత, వర్గ, పార్టీల కతీతంగా లక్షల కోట్ల రూపాయలను నేరుగా అందించారని, ఆ అభిమానమే నేడు సిద్ధం సభల రూపంలో జనసునామీగా కనిపిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, బత్తుల ఏడుకొండలు, అబ్దుల్ జలీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వివిధ కార్పొరేషన్‌ల రాష్ట్ర డైరెక్టర్లు కామనబోయిన కోటయ్య, ఉప్పలపాటి జాని, బూదాల మరియమ్మ, ఎంపీపీలు బూడిద మంగమ్మ, సీనియర్ నేత బూడిద శ్రీను, వెల్దుర్తి ఎంపీపీ చింతా శివరామయ్య, ఆదినారాయణ, ఎంపీపీలు సంపూర్ణ, జెడ్పీటీసీలు మల్లుస్వామి, రమావత్ రూప్లీ బాలునాయక్, షేక్ షఫీ, పోలా శ్రీనివాసరావు, యాదవ, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టరేట్ శివశంకర్ లోతేటి
- స్పందనలో 128 ఫిర్యాదులు



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టరేట్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట రూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరేట్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాల్‌లో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంలు స్పందన ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తమ సమస్యలను వినతుల రూపంలో జిల్లా అధికారులకు సమర్పించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 128 ఫిర్యాదులు అందాయి. అర్జీదారులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో భోజన వసతి కల్పించారు. అన్ని శాఖల జిల్లా అధికారులతో పాటు కలెక్టరేట్ సిబ్బంది హాజరయ్యారు.

బైపాస్ ప్రారంభంతో తొలగిన కష్టాలు

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి



పైలాన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కాసు, అనిల్ కుమార్ యాదవ్

పిడుగురాళ్ల: ఎన్నో ఏళ్లుగా ఆదరణకు నోచుకోని బైపాస్ రోడ్డును పూర్తి చేయించి ప్రారంభింపజేసిన ఘనత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిదేనని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని కొండమోడు సమీపంలోని బైపాస్‌రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బైపాస్ రోడ్డులో నిర్మించిన రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే పూర్తి అయినప్పటికీ పిడుగురాళ్ల బైపాస్ రోడ్డు మాత్రమే పూర్తి కాకుండా వెలితిగా కనిపించేదన్నారు. ఇది పూర్తి కావటంతో పిడుగురాళ్ల పట్టణంలోని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ పని పూర్తి చేయటంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు.

పిడుగురాళ్ల బైపాస్ ప్రజలకు అంకితం..

పిడుగురాళ్ల బైపాస్‌ను పూర్తిచేసి ప్రజలకు అంకితం చేశామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కొండమోడు సమీపంలోని బైపాస్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డు, రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం బైపాస్ రోడ్డు నిర్మాణమేనన్నారు. కాబట్టే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి బైపాస్ రోడ్డు నిర్మాణం శరవేగంగా ప్రారంభించి, పూర్తిచేశామన్నారు. మార్చి 13వ తేదీ నుంచి ఈ రోడ్డుపై వాహన రాకపోకలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పైలాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, క్యూబ్ హైవే ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధి శుభపరిణామం

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌తో కలిసి నరసరావుపేట స్టేషన్‌లో రూ.11.3కోట్ల పనులకు శంకుస్థాపన



బటన్ నొక్కి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

నరసరావుపేట: గుంటూరు డివిజన్ పరిధిలో రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడం శుభపరిణామమని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశ రైల్వే రంగంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.11.3కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశారని, దీంతో పాటు ప్రకాషనగర్ వైపు ప్రవేశమార్గం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. మొదటిగేటు వద్ద అండర్‌పాస్, చిత్రాలయ థియేటర్ వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. నరసరావుపేట నుంచి హైదరాబాద్‌కు సులభంగా వెళ్లే మార్గం కల్పించాలని రైల్వేశాఖ అధకారులను కోరారు. షేక్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆషాబేగం ఖాజావలి, మాదిగ, గిరిజన, ముదిరాజు కార్పొరేషన్ల డైరెక్టర్లు కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, ఈఎం స్వామి, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి సురేష్‌బాబు, రైల్వేశాఖ అధికారి షాబాజు పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలతో చదువులు కొనసాగించాలి

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో కలిసి గురుకుల పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం



గురుకుల పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కలిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని నిర్దేశిత లక్ష్యాలతో చదువులు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. మండలంలోని పెదతురకపాలెంలో నూతనంగా నిర్మించిన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ విద్యా కేంద్రంగా పెదతురకపాలెం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 350 మంది విద్యార్థినులకు అవకాశం కల్పించే విధంగా మూడు పాఠశాలలు, వసతి గృహాలు ఇక్కడ ఏర్పాటు అవుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రాంతంలో అంతర్గత రోడ్లతో పాటు గురుకుల పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ చదువుకు మించిన ఆస్తి లేదన్నారు. దీనిని విద్యార్థులు గుర్తించి ఇష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విద్యాశాఖలో పలు సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సుజాతపాల్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, గిరిజన సంక్షేమ శాఖ అధికారి లోతేటి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో బ్రాహ్మణులకు న్యాయం

- నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి
- మాచర్లలో రూ.1.40 కోట్లతో నిర్మించిన శివాలయం, కల్యాణ మండపాల ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న అనిల్‌కుమార్, పీఆర్కే, కోన రఘుపతి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ కుమార్

మాచర్ల: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని నర్సరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించటంతో పాటు వారి అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయించి వారి ఆశీస్సులు పొందిన తొలి ముఖ్యమంత్రి సీఎం జగన్ అని అన్నారు. సోమవారం మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్డులో 25 సెంట్ల ప్రభుత్వ భూమిలో రూ.1.40 కోట్లతో నిర్మించిన శ్రీ గాయత్రీ శారదాదేవి శివాలయం, గాయత్రీ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన మీనాక్షీ సుందరేశ్వర కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతితో కలిసి పూజలు నిర్వహించారు.

దేశ చరిత్రలో కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా పేద బ్రాహ్మణులకు అన్ని రకాలుగా ఆదుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. దేవాలయాలకు ధూప దీప నైవేద్యాల నిమిత్తం రూ.10 వేలు అందేలా చర్యలు తీసుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వెనుకబడిన ప్రాంతం పల్నాడులో హైవే పక్కన రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని బ్రాహ్మణులకు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలకు రూ.40 లక్షల నిధులు కేటాయించారన్నారు. 150 మంది బ్రాహ్మణులకు ఒకే చోట ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ప్రతి బ్రాహ్మణుడికి పింఛన్ అందేలా చర్యలు చేపట్టారన్నారు. ఇదంతా సీఎం జగన్ పాలనతోనే సాధ్యమైందన్నారు. నెల్లూరులోనూ తాను రూ.2 కోట్ల నిధులను బ్రాహ్మణులకు కేటాయించినట్లు మాజీ మంత్రి అనిల్ చెప్పారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి కామేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎం కృష్ణ ప్రసాద్, జిల్లా నాయకులు ఎం శ్రీనివాస శర్మ, నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు దండెంరాజు హనుమంతరావు, సాగి వెంకటేశ్వర శాస్త్రి, డాక్టర్ నరసింహమూర్తి, ఎం లక్ష్మీనారాయణ, నరసింహశర్మ, జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు పురుషోత్తం, శ్రీనివాసరావు, డాక్టర్ రమణమూర్తి, కమలాసనరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 5 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఈపూరు : విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన సంఘటన మండలంలోని కొండ్రముట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మేరాజోత్ శ్రీనివాస్‌నాయక్ పదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థినిని గత కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌నాయక్‌పై తోటి విద్యార్థినులు ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆమె ప్రాథమిక విచారణ జరిపి జిల్లా ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వినుకొండ ఎంఈవో జఫ్రుల్లాఖాన్‌ను ఈ ఘటనపై విచారణ జరపాలని ఆదేశించారు. విచారణ అనంతరం ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌నాయక్ చేసిన అకృత్యాలు, విద్యార్థినుల పట్ల వేధింపులు బయటపడ్డాయి. ఎంఈవో తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపడంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి శుభ పరిణామం

ప్రభుత్వ విప్ పీఆర్కే



రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరైన విప్ పీఆర్కే

మాచర్ల: దేశ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఆయా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయటం ఎంతో మంచి కార్యక్రమమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులకు గానూ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ముందుగా స్టేషన్ అధికారితో మాట్లాడారు. అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మాచర్ల ప్రాంతంలో ప్రయాణికులకు అవసరమైన మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ అధికారులు, బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాష్టీకం

- పొలం నుంచి తిరిగి వస్తుండగా ఆయుధాలతో దాడి
- బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే బొల్లా



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పాత కొత్తపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అమరా రమేష్ తన పొలానికి వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొండి అంకమరావు, రమణమ్మలతో పాటు మరో నలుగురు వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న బాధితుడు అమరా రమేష్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకుల అరాచకాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని అన్నారు. తమ పార్టీ సానుభూతి పరుడైన రమేష్‌ను మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అతని పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఇలా దాడులు చేసి ఎంతమందిని బెదిరించాలని చూస్తున్నారని మండిపడ్డారు. కార్యకర్తలకు అండగా ఉంటానని ఈ దాడికి పాల్పడినవారు ఎవరైనా వదిలేది లేదని హెచ్చరించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్ష పడేలా చేస్తామన్నారు.

బావిలో పడి మహిళ అనుమానాస్పద మృతి



మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యడ్లపాడు: మండలంలోని కొత్తసాలస గ్రామంలో అనుమానాస్పద రీతిలో మహిళ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలోని తూర్పు దిశ పొలాల వైపు స్మశాన వాటిక సమీపంలో ఉన్న ఓ బావిలో మహిళ మృతదేహం తేలి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతురాలు ప్రకాశం జిల్లా వాసిగా నిర్ధారించారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు..ప్రకాశం జిల్లా పట్టేపురం గ్రామానికి చెందిన చలంచర్ల నాగమ్మ, కోటేశ్వరరావు దంపతులకు ఇద్దరు సంతానం. దంపతుల మధ్య నెలకొన్న వివాదాలతో కొంత కాలంగా భర్త, పిల్లలకు నాగమ్మ దూరంగా ఉంటుంది. మొదట కారంపూడిలో ఉంటూ రెండేళ్ల కిందట కొత్తసాలస గ్రామం ఎస్టీ(యానాది) కాలనీలో సమీప బంధువుల వద్ద ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఒంటరిగా జీవిస్తుంది. ఇటీవల ఆమె కాలనీ వాసులకు కనిపించకుండా పోయింది. ఆదివారం రాత్రి గ్రామంలోని తూర్పు పొలాల్లోని బావిలో మహిళ శవం కనిపించడంతో స్థానికులు గమనించి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన చిలకలూరిపేట రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ సిబ్బందితో సోమవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలు, నాగమ్మ కుటుంబ సభ్యుల్ని పిలిపించి విచారణ చేశారు. బావిలోని మృతదేహాన్ని బయటకు తీయించి మృతి చెందినది నాగమ్మగా నిర్ధారణకు వచ్చారు. ఒంటరి జీవితం, దానికి తోడు పలు అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మోసపోయాను.. న్యాయం చేయండి

స్పందనలో జిల్లా ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట టౌన్: క్రిప్టో కరెన్సీ ద్వారా డబ్బులు వస్తాయని నమ్మబలికారు. దీంతో అప్పు చేసి మరీ రూ.25 లక్షలు చెల్లించాను. ఏళ్లు గడుస్తున్నా చేతికి చిల్లిగవ్వ కూడా రాలేదు. మాయ మాటలు విని మోసపోయాను. మీరే న్యాయం చేయండంటూ రెంటచింతల గ్రామానికి చెందిన నాగేండ్ల వెంకటేశ్వర్లు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశాడు. దీంతో పాటు జిల్లా నలుమూలల నుంచి కుటుంబ, ఆస్తి తగాదాలకు సంబంధించిన పలు ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



బహిరంగ సభలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్

- వచ్చే ఎన్నికల్లో పల్నాడు పౌరుషాన్ని చూపాలి
- నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్

మాచవరం: బీసీలకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటి సారిగా విచ్చేసిన అనిల్‌కుమార్ యాదవ్‌కు గురజాల నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ఒక్క బీసీకి సీటు ఇవ్వలేని దుర్మార్గుడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నాయకుల మోసపూరిత హామీలను నమ్మవద్దని పొరపాటు చేస్తే ఐదేళ్లు వెనక్కి వెళ్లాల్సివస్తుందన్నారు. పల్నాడు పౌరుషాన్ని నిలబెడుతూ ప్రజల తరపున ధీటుగా నిలబడతానన్నారు. పార్టీని గెలిపించే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని పిలుపునిచ్చారు. జనం గుండెల్లో గూడు కట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి ప్రజా ప్రభుత్వాన్ని నిర్మించేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. ఒక సామాన్యుడికి పట్టం కట్టిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ శివ యాదవ్, మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీలు చింతపల్లి సన్నే సైదా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడిన ఘటనలో నిందితులకు రిమాండ్

బొల్లాపల్లి: వన్యప్రాణులను వేటాడిన ఘటనలో అరెస్టు చేసిన నలుగురు నిందితులను కోర్టుకు హాజరుపరచినట్లు అటవీ శాఖ వినుకొండ రేంజర్ సయ్యద్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొల్లాపల్లికి చెందిన నిందితులు ఎస్‌కే మాబూ, ఉబ్బరపు రాజులు, గోగు నాగరాజు, తన్నీరు నరసింహారావులను వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచామని, వీరికి రిమాండ్ విధించారని రేంజర్ వెల్లడించారు. అదే గ్రామంలో చెరువు పరిసర ప్రాంతంలో దాచిన 20 జింక కొమ్ములు, ఒక చర్మం స్వాధీన పరుచుకున్నట్లు చెప్పారు. డీఆర్వో ఎం సురేంద్ర, బీట్ అధికారులు రామకృష్ణ, గణేష్, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

నలుగురు బెల్ట్ షాప్ నిర్వాహకుల అరెస్టు

నగరంపాలెం: గొలుసు దుకాణాలు (బెల్ట్ షాప్) నిర్వహించే నలుగుర్ని, ఒక సూపర్‌వైజర్‌ను ఎస్ఈబీ (సెబ్) స్టేషన్ గుంటూరు-1 పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2.20 లక్షలు ఖరీదు చేసే 143 మద్యం (క్వార్టర్) సీసాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సెబ్ స్టేషన్-1లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సెబ్ ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు కేసు వివరాలను సెబ్ గుంటూరు సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, ఏఎస్ ఎస్.కృష్ణకిషోర్‌రెడ్డి, స్టేషన్-1 సీఐ పి.విజయ్‌కుమార్‌తో కలిసి వెల్లడించారు. ముందస్తు సమాచారంతో పెదకాకాని మండలం అగతవరపాడు గ్రామ శివార్లలో ఆదివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఆటోలో తరలిస్తున్న 143 మద్యం సీసాలను గుర్తించి, నెహ్రూనగర్ ఒకటో వీధికి చెందిన షేక్ మస్తాన్ అలియాస్ విష్ణు, షేక్ నాగుల్‌మీరా, మోతినగర్ ఒకటో వీధికి చెందిన షేక్ జాన్‌బీ, ప్రస్తుతం ఆర్టీసీకాలనీ ఆరో వీధిలో ఉంటున్న పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామవాసి మేకల సురేష్, మంగళదాస్‌నగర్ రెండో వీధికి చెందిన ప్రభుత్వ మద్యం దుకాణ సూపర్‌వైజర్ మేరిగ జాషువాను అదుపులో కి తీసుకుని విచారించారు. విచారణలో నేరం రుజువుకావడంతో ఐదుగుర్ని అరెస్ట్ చేసి, రూ.2.20 లక్షలు విలువైన 143 మద్యం క్వార్టర్ సీసాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

రాజీకి రానన్నాడని హతమార్చాడు!

తూములూరులో వ్యక్తి దారుణ హత్య



నాలాది సాంబశివరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న తెనాలి డీఎస్పీ రమేష్

తూములూరు(కొల్లిపర): పాత కేసు విషయంలో రాజీ పడనందున ఓ వ్యక్తిని ప్రత్యర్థులు హతమార్చిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్ర రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని తూములూరు గ్రామానికి చెందిన నాలాది సాంబశివరావు (35) అదే గ్రామానికి చెందిన సమ్మెట ఆంజనేయులు కుటుంబ సభ్యుల మధ్య పాత కేసులు ఉన్నాయి. దీనిపై కోర్టులో విచారణ జరుగుతోంది. అయితే కేసు విషయంలో రాజీకి రావటం లేదని భావించిన సమ్మెట ఆంజనేయులు, అతని భార్య భూలక్ష్మి, మరో వ్యక్తి చాగంటి శేఖరరెడ్డిలతో కలసి దావులూరు అడ్డురోడ్డు వద్ద ఆదివారం రాత్రి సాంబశివరావును హతమార్చినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వివరాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి వైద్య శాలకు తరలించారు. ఇదిలా ఉంటే నిందితులను తక్షణమే అరెస్టు చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ దళిత సంఘాలు ధర్నా నిర్వహించాయి.